సాక్షి హనుమకొండ

గురువారం | 18 | సెప్టెంబర్ | 2025



అప్రమత్తతే ఆయుధం..

ప్రస్తుత వాతావరణ పరిస్థితిలో మిరప పంటలో చీడపీడలు ఆశిస్తున్నాయని, రైతులు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని మల్యాల కేవీకే శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. - 8లో



వైభవంగా దసరా ఉత్సవాలు నిర్వహిస్తాం

సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని మంత్రి కొండా సురేఖ అన్నారు. - 8లో

గరిష్టం/కనిష్టం
32.0° /24.0°

వాతావరణం

జిల్లాలో ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం సాధారణ పరిస్థితి ఉంటుంది. పలుచోట్ల చిరుజల్లుల నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మహిళ ఆరోగ్యంతోనే కుటుంబ ఆరోగ్యం



హన్మకొండ: మహిళ ఆరోగ్యంతోనే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. స్వస్థ్ నారి.. సశక్తి పరివార్ అభియాన్‌లో భాగంగా బుధవారం హనుమకొండ సమ్మయ్యనగర్‌లోని లష్కర్‌సింగారం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జాతీయస్థాయిలో ఈ కార్యక్రమాన్ని వర్చువల్‌గా ప్రారంభించిన తర్వాత ఈ మెగా వైద్య శిబిరాన్ని కలెక్టర్ స్నేహ శబరీష్‌తో కలిసి కడియం కావ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ మహిళలకు అవసరమైన వైద్యసేవలందించాలని డాక్టర్లు, సిబ్బందికి సూచించారు. టీబీ ముక్త్ అభియాన్‌లో భాగంగా దాతలు అందించిన పోషకాహార కిట్లను టీబీ వ్యాధిగ్రస్తులకు అందించారు. డీఎంహెచ్‌ఓ అప్పయ్య, అడిషనల్ డీఎంహెచ్‌ఓ టి.మదన్‌మోహన్‌రావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయకుమార్, డాక్టర్లు అజిత్ మహమ్మద్, సుదీప్, ప్రశాంత, హారిక, హిమబిందు, ఇత్తదార్ అహ్మద్, సనత్ చందర్, భానుచందర్, హైదర్, డెమో అశోక్ రెడ్డి, ఎన్‌హెచ్‌ఎం డీపీఎం రుక్మొద్దీన్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థులు సహకారం అందించాలి



కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాలలో చదువుకొని వివిధ దేశాల్లో స్థిరపడ్డ పూర్వ విద్యార్థుల కృషిని అభినందిస్తూ, వర్సిటీ అభివృద్ధిలో పూర్వ విద్యార్థులు సహకారం అందించాలని కేయూ వీసీ ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డి కోరారు. అమెరికాలోని అట్లాంటాలో ఫార్మసీ కళాశాల గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు నిర్వహించగా వీసీ ప్రతాప్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సెలబ్రేట్ అండ్ కాంట్రిబ్యూట్ అనే థీంతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. ఫార్మా రంగంలో ఎంతోమంది ఉన్నత స్థితిలో ఉన్నారని పేర్కొన్నారు. పూర్వ విద్యార్థుల సమూహాలు యూనివర్సిటీ గ్లోబల్ భాగస్వామ్యానికి రావాలని కోరారు. అలుమ్ని గోల్డెన్‌జూబ్లీ రీసెర్చ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అమెరికా సంయుక్తరాష్ట్రాల విశ్వవిద్యాలయ ఫార్మసీ చాప్టర్, కేయూ ఫార్మసీ విభాగం పూర్వవిద్యార్థి సాంబారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ పరుచూరితో పాటు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థుల స్టైఫండ్ వెంటనే విడుదల చేయాలి

ఎంజీఎం : రాష్ట్రంలోని వైద్య విద్యార్థుల పెండింగ్ స్టైఫండ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని తెలంగాణ జూనియర్ డాక్టర్ అసోసియేషన్ (టీ–జుడా) బాధ్యులు బుధవారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టరేట్ (డీఎంఈ) పరిధిలోని సంస్థల అధిపతులు స్టైఫండ్ బిల్లులను సమయానికి సమర్పించినా, ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌లో ఆమోదానికి నిలిచిపోతున్నాయని తెలిపారు. స్టైఫండ్ విడుదల కాకపోవడంతో జూనియర్ డాక్టర్లు, సీనియర్ రెసిడెంట్లు, సూపర్ స్పెషాలిటీ విద్యార్థులు, డెంటల్ పోస్ట్ గ్రాడ్యుయేట్లు, హౌస్ సర్జన్లు, నర్సింగ్ విద్యార్థులు ఆర్థికంగా సతమతవుతున్నారని పేర్కొన్నారు. సకాలంలో స్టైఫండ్ విడుదల చేయాలని ఇప్పటికే ప్రభుత్వానికి వినతులు అందించామని చెప్పారు.

కృత్రిమమేధ.. కీలక పాత్ర

విద్యారణ్యపురి : వ్యవసాయం, ఫార్మా, వ్యాపార, వాణిజ్య తదితర రంగాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధ) కీలక పాత్ర పోషిస్తోందని కాకతీయ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కె.రాజేందర్ తెలిపారు. బుధవారం హనుమకొండలోని ప్రభుత్వ పింగిళి మహిళా డిగ్రీఅండ్ పీజీ కళాశాలలో కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రీ షేపింగ్ ది లాండ్‌స్కేప్ ఆఫ్ కామర్స్‌అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ అనే అంశంపై నిర్వహించిన జాతీయ సదస్సులో రాజేందర్ పాల్గొని మాట్లాడారు. ఈ సదస్సులో హైదరాబాద్ ఎంజెల్స్ సీఈఓ, ఇన్వెస్ట్‌మెంట్ డైరెక్టర్ రత్నాకర్ సామవేదం కీలక ఉపన్యాసం చేశారు. అనంతరం అతిథులు సావనీర్‌ను ఆవిష్కరించారు. పలువురు పరిశోధన పత్రాలు సమర్పించారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.చంద్రమౌళి, వైస్ ప్రిన్సిపాల్ సుహాసిని, సదస్సు కన్వీనర్ డాక్టర్ రాజిరెడ్డి, కేయూ ప్రొఫెసర్ పి.అమరవేణి, కామర్స్ విభాగం అధిపతి డాక్టర్ సారంగపాణి, హుస్నాబాద్ కాలేజీ ప్రిన్సిపాల్ భిక్షపతి పాల్గొన్నారు.

ప్రజా ప్రభుత్వంతోనే అభివృద్ధి

- సాదాబైనామాతో భూసమస్యలు పరిష్కారం
- ముందు చూపుతో గ్రేటర్ వరంగల్ అభివృద్ధి
- ప్రజాపాలన వేడుకల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి





మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, హాజరైన ఉద్యోగులు

హన్మకొండ అర్బన్: ప్రజా ప్రభుత్వంతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం హనుమకొండ కలెక్టరేట్‌లో ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. పదేళ్ల కాలంలో ఈ ప్రాంత అభివృద్ధి హామీలు, కాగితాలకే పరిమితమైందని, తమ ప్రభుత్వం మాటల్లో కాకుండా చేతల్లో చూపిస్తోందన్నారు. హైదరాబాద్–సికింద్రాబాద్ నగరాల మాదిరిగానే హనుమకొండ–వరంగల్ నగరాలు కూడా కలిసి ఉన్నాయని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా దాదాపు రూ.5 వేల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు.

త్వరలో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ పనులు ప్రారంభం..

2057 జనాభాను దృష్టిలో పెట్టుకొని రూ.4,100 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు త్వరలోనే ప్రారంభించనున్నట్లు మంత్రి వెల్లడించారు. 2040 అవసరాలకు సరిపోయేలా మాస్టర్ ప్లాన్‌ను తీసుకువచ్చినట్లు వివరించారు. భద్రకాళి ఆలయ మాడవీధుల నిర్మాణ పనులు చివరి దశలో ఉన్నాయని, అలాగే, హనుమకొండ కలెక్టరేట్ బంగ్లాను ఆధునికీకరించినట్లు చెప్పారు. హైవేల విస్తరణలో భాగంగా స్టేషన్‌ఘన్‌పూర్–ఐనవోలు (వయా) కూనూర్, గర్నేపల్లి వరకు రోడ్డు వెడల్పు పనులు, ఓగ్లాపూర్–ధర్మారం వరకు 13 కిలోమీటర్ల రోడ్డు విస్తరణ పనులు పూర్తి కావొస్తున్నాయని తెలిపారు.

జిల్లాలో రెండు ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు..

భీమదేవరపల్లి మండలం వంగరలో రూ.7 కోట్లతో మాజీ ప్రధాని పీవీ నరసింహారావు విజ్ఞాన వేదిక అభివృద్ధి పనులు చివరి దశలో ఉన్నాయన్నారు. పరకాలలో రూ.35 కోట్లతో చేపట్టిన 100 పడకల ఆస్పత్రి పనులు సాగుతున్నాయని చెప్పారు. జిల్లాలో రెండు ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. క్రీడా పాఠశాల, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు ప్రభుత్వం ప్రతిపాదించిందని, తాత్కాలికంగా జేఎన్‌ఎస్‌లో స్పోర్ట్స్ స్కూల్ ప్రారంభించడానికి సిద్ధం చేసినట్లు మంత్రి వివరించారు.

ఆరోగ్యశ్రీతో పేదలకు ఉచిత వైద్యసేవలు..

గత ప్రభుత్వం నగరంలో కాళోజీ కళాక్షేత్రానికి శంకుస్థాపన చేసి గాలికి వదిలేసిందని, తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కళాక్షేత్రం పనులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేసి సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించినట్లు మంత్రి తెలిపారు. ఆరోగ్యశ్రీ ద్వారా వేలాది మంది పేదలు ఉచిత వైద్యసేవలు పొందుతున్నారని, జిల్లాలో మహాలక్ష్మి పథకం కింద మహిళలు ఉచిత బస్సు సౌకర్యం, గృహలక్ష్మి పథకం ద్వారా వేలాది రాయితీ సిలిండర్లు, గృహజ్యోతి పథకం కింద లక్ష మందికి పైగా కుటుంబాలు ఉచితంగా 200 యూనిట్ల వరకు విద్యుత్ ఉపయోగించుకుంటున్నాయని తెలిపారు.



కలెక్టరేట్‌లో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, చిత్రంలో ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు నాగరాజు, రాజేందర్ రెడ్డి, కలెక్టర్ స్నేహశబరీష్, సీపీ సన్‌ప్రీత్ సింగ్

435 ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు..

అమ్మ ఆదర్శ పాఠశాల పథకం ద్వారా జిల్లాలో 435 ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించామని, వేలాది మందికి కొత్త రేషన్‌కార్డులు జారీ చేయడంతో పాటు వేలాది మంది కుటుంబ సభ్యుల పేర్లను అదనంగా రేషన్ కార్డుల్లో చేర్చినట్లు చెప్పారు. మత్స్యకారులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు మత్స్య సంపద పెంచేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ ఏడాది 771 చెరువుల్లో కోటికి పైగా చేపపిల్లలను వంద శాతం రాయితీతో పంపిణీ చేసినట్లు వివరించారు. వన మహోత్సవంలో భాగంగా ఈ ఏడాది 23 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.

ఐదు వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ తోటలు..

విత్తనాలు, ఎరువులు రైతులకు అందుబాటులో ఉంచామని, నకిలీ విత్తన, ఎరువుల కొరత అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లాలో ఈ ఏడాది దాదాపు ఐదు వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ తోటలు సాగు చేసేందుకు రైతులను ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు. సాదాబైనామాతో భూసమస్యలు పరిష్కారమవుతాయని, భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో భూ భారతి చట్టం తీసుకువచ్చినట్లు తెలిపారు. అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానాన్ని తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. తొలి విడత ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేసినట్లు వివరించారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసేందుకు ఇందిరా మహిళా శక్తి మిషన్ పాలసీని ఆవిష్కరించినట్లు తెలిపారు. 60 వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేసినట్లు తెలిపారు. ఎంఎస్‌ఎంఈ పాలసీ –2024 ద్వారా రానున్న ఐదేళ్లలో సుమారు 4 వేల కోట్లు ఖర్చుచేసి పరిశ్రమలను స్థాపించనున్నట్లు పేర్కొన్నారు. దీంతో ప్రైవేట్ రంగంలో యువతకు మరింత ఉపాధి అవకాశాలు దొరుకుతాయని వివరించారు.

విదేశాల నుంచి పెట్టుబడులు..

రాష్ట్రాన్ని ప్రపంచ వేదికపై ఆవిష్కరించడంలో విజయం సాధించామన్నారు. అమెరికా, దక్షిణ కొరియా, సింగపూర్, దావోస్, జపాన్ దేశాల్లో పర్యటించి భారీగా పెట్టుబడులు సాధించామని వివరించారు. హైదరాబాద్ వేదికగా పలు గ్లోబల్ ఈవెంట్లు నిర్వహించామని ఏఐ గ్లోబల్ సమ్మిట్, బయో ఏషియా సదస్సు, ప్రపంచ సుందరి పోటీలు విజయవంతంగా నిర్వహించామన్నారు. మేయర్ సుధారాణి, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, నాగరాజు, ఎంపీ కడియం కావ్య, హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు, స్నేహ శబరీష్, సత్యశారద, గ్రేటర్ కమిషనర్ చాహత్‌బాజ్‌పాయ్, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పరిహారం అందిస్తాం..

భూ నిర్వాసితుల సమావేశంలో ఆర్డీఓ



మాట్లాడుతున్న ఆర్డీఓ రమేశ్ రాథోడ్

వేలేరు : కాల్వ నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం తరఫున పరిహారం అందిస్తామని హనుమకొండ ఆర్డీఓ రమేశ్ రాథోడ్ తెలిపారు. బుధవారం గౌరవెల్లి ప్రాజెక్టు నుంచి మండలంలోని ఎర్రబెల్లి గ్రామానికి వచ్చే కాల్వ కింద భూములు కోల్పోతున్న రైతులతో తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీఓ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరువు ప్రాంతమైన ఎర్రబెల్లిలో కెనాల్ ఏర్పాటు చేయడం ద్వారా దాదాపు 2వేల ఎకరాలకు సాగు నీరు అందుతుందని అన్నారు. భూ సేకరణకు రైతులందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ హెచ్.కోమి, ఆర్ఐ సురేందర్, సీనియర్ అసిస్టెంట్ హేమ నాయక్, సిబ్బంది ఉన్నారు.

నాబార్డ్ అధికారుల పర్యటన



సోలార్ పశుగ్రాసాన్ని పరిశీలిస్తున్న శ్రీకాంత్ జాంబ్రే

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలంలో నాబార్డ్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ మేనేజర్ శ్రీకాంత్ జాంబ్రే పర్యటించారు. బుధవారం మండలంలోని ముస్తఫాపూర్ గ్రామంలో ఏకే విశ్వనాథరెడ్డి గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాటర్ షెడ్ కార్యక్రమంలో భాగంగా సోలార్ కంచె, సోలార్ పశుగ్రాసం, బయోగ్యాస్, మొబైల్ స్టార్టర్, మొక్కల పెంపకాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నీటి సంరక్షణ, భూసార యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. అనంతరం మత్స్య సహకార సంఘానికి చేపపిల్లల కొనుగోలుకు చెక్కు అందజేశారు. నాబార్డ్ వరంగల్ క్లస్టర్ డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ మేనేజర్ చంద్రశేఖర్, ఏజీఎం చైతన్య రవితంగ, దేవేందర్, సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దాలి



మాట్లాడుతున్న ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి

మామునూరు: విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దాలని ఎంఈఓ ఎస్.వెంకటేశ్వర్‌రావు, ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి యాదగిరి, నిస్సా జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జేపీ పరంజ్యోతి, ట్రస్మా కార్యదర్శి ఎస్.వెంకటేశ్వరరావు సూచించారు. వరంగల్ ఆర్టీఏ జంక్షన్ సమీపంలోని బిర్లా ఓపెన్ మైండ్ ఇంటర్నేషనల్ హైస్కూల్ ప్రాంగణంలో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు ఆడెపు శ్యాం అధ్యక్షతన బుధవారం ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు అందజేసి సన్మానించారు. టస్మా, వడుప్సా జిల్లా ప్రతినిధులు బిల్లా రవి, జ్ఞానేశ్వర్‌సింగ్, కోడెం శ్రీధర్, బుచ్చిబాబు, సంతోష్‌రెడ్డి, జనార్దన్, ఆడెపు వెంకటేశ్వర్లు, ముక్కెర రవీందర్, కూచన క్రాంతికుమార్, కూచన కవిత, సబిత, సురేఖ పాల్గొన్నారు.

రేపు మెగా జాబ్‌మేళా

కేయూ క్యాంపస్: యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఈనెల 19న నిర్వహించనున్న మెగా జాబ్‌మేళా వాల్‌పోస్టర్లను కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం, అధ్యాపకులు కళాశాలలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్‌మేళాలో అనేక కంపెనీలు పాల్గొననున్నాయని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని రిజిస్ట్రార్ సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రహమాన్, కళాశాల ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ డాక్టర్ జితేందర్, ఫిజిక్స్ విభాగం అధిపతి డాక్టర్ వరలక్ష్మి, నిర్మాణ్ సంస్థ ప్రతినిధి సందీప్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై మంత్రి సమీక్ష

హన్మకొండ అర్బన్: ప్రజా పాలన వేడుకల అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హనుమకొండ కలెక్టరేట్‌లో సుమారు గంటసేపు హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు, మేయర్, గ్రేటర్ కమిషనర్, జిల్లా ప్రజాప్రతినిధులతో సమావేశమయ్యారు. అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు, కాంగ్రెస్ అంతర్గత విషయాలపై చర్చించినట్లు సమాచారం. అయితే, ఈ విషయాన్ని ఎక్కడా అధికారికంగా వెల్లడించలేదు. అంతకుముందు ప్రజాపాలన వేడుకల కోసం నగరానికి వచ్చిన మంత్రి పొంగులేటికి నిట్‌లో అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనస్వాగతం పలికారు.

అమరవీరులకు నివాళి..

హనుమకొండ అదాలత్ కూడలిలోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీశ్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

ప్రభుత్వ పథకాలు దేశానికే ఆదర్శం

నగర మేయర్ గుండు సుధారాణి

వరంగల్ అర్బన్: రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని వరంగల్ బల్దియా ప్రధాన కార్యాలయంలో ఆమె జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. 2023 డిసెంబర్ 7న ప్రారంభమైన ప్రజాప్రభుత్వం స్వేచ్ఛ, ప్రజాస్వామ్య పునరుద్ధరణకు ప్రాధాన్యం ఇచ్చిందని తెలిపారు. 20 నెలల్లో సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో దూసుకుపోతోందని వివరించారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరుగ్యారంటీలను అమలు చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందన్నారు. నగర పరిధిలో 7 ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు, 50 వివిధ రకాల యూనిట్లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. గ్రేటర్ పరిధిలో 76,378 మందికి చేయూత పెన్షన్లు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. తమ అక్షరాలతో ప్రజల్లో ఉత్తేజాన్ని నెలకొల్పిన సురవరం ప్రతాప్‌రెడ్డి, ప్రజాకవి కాళోజీ, దాశరథి కృష్ణమాచార్యులు, సుద్దాల హనుమంతు, షోయబుల్లాఖాన్, బండి యాదగిరి వంటి సాహితీమూర్తులకు నివాళులర్పించారు. బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, అడిషనల్ కమిషనర్ చంద్రశేఖర్, ఈఈ రవికుమార్ పాల్గొన్నారు.

బతుకమ్మ ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలి

బతుకమ్మ వేడుకలకు విస్తృత ఏర్పాట్లు చేయాలని మేయర్ సుధారాణి అధికారులను ఆదేశించారు. బుధవారం గ్రేటర్ ప్రధాన కార్యాలయంలోని మేయర్ ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. తొలిరోజు వేయిస్తంభాల ఆలయంలో పెద్ద ఎత్తున నిర్వహించే బతుకమ్మ వేడుకకు లైటింగ్, పారిశుద్ధ్య పనులు, తాగునీటి సదుపాయం కల్పించాలని కోరారు. హనుమకొండ పరిధి 26 ప్రాంతాల్లో, వరంగల్ పరిధి 20 ప్రాంతాల్లో అవసరమైన మేరకు లైటింగ్, డస్ట్‌తో పాటు రోడ్ల ప్యాచ్ వర్క్ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. డీఈలు సారంగం, రవికిరణ్, టీఎంసీ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ జెండాకు వందనం చేస్తున్న మేయర్ సుధారాణి, కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

రాజకీయ వ్యవస్థను నిర్వీర్యం చేసిందే కేసీఆర్

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హన్మకొండ చౌరస్తా: రాజకీయ వ్యవస్థను నిర్వీర్యం చేసిందే కేసీఆర్ అని కాంగ్రెస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 36 మంది ఎమ్మెల్యేలను బీఆర్‌ఎస్‌లో చేర్చుకొని ఇద్దరికి మంత్రి పదవులు ఇచ్చారని గుర్తుచేశారు. మీరు చేస్తే సంసారం, మేము చేస్తే వ్యభిచారమా అని ప్రశ్నించారు. ఉప ముఖ్యమంత్రిగా ఉన్న రాజయ్యను ఎందుకు తొలగించారో జవాబు చెప్పాలని అన్నారు. కవిత వ్యాఖ్యలపై స్పందించి తాము ఏ అక్రమాలకు పాల్పడలేదని ముక్కునేలకు రాయాలని హరీశ్‌రావు, కేటీఆర్‌కు సవాల్ విసిరారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ మారిన ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలంటున్న హరీశ్‌రావు, కేటీఆర్.. దమ్ముంటే మీరందరూ రాజీనామా చేసి గెలవాలని డిమాండ్ చేశారు. వచ్చే శాసనసభ ఎన్నికల నాటికి బీఆర్‌ఎస్ పార్టీ ఉంటుందన్న నమ్మకం లేదన్నారు. వరంగల్ ఎంపీ కడియం కావ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్, నాయకులు వీసం సురేందర్‌రెడ్డి, డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ, పింగిళి వెంకట్‌రెడ్డి, నాయిని లక్ష్మారెడ్డి, తాడిశెట్టి విద్యాసాగర్, మార్క విజయ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ది ప్రజాకంఠక పాలన

బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్



మాట్లాడుతున్న దాస్యం వినయ్‌భాస్కర్

హన్మకొండ: కాంగ్రెస్‌ది ప్రజాకంఠక పాలన అని బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ మాజీ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ దుయ్యబట్టారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ సమైక్యతా దినోత్సవం సందర్భంగా తెలంగాణ అమరవీరులకు నివాళులర్పించామన్నారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ తెలంగాణ ప్రజల కలను సాకారం చేశారన్నారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజలను వంచిస్తోందని ధ్వజమెత్తారు. హక్కుల కోసం పోరాడితే అక్రమ కేసులు పెట్టడం, మైనారిటీలను ఎమ్మెల్యేగా, మంత్రిని చేయకపోవడం ప్రజాపాలన అని ప్రశ్నించారు. ఇచ్చిన ఎమ్మెల్సీ పదవిని కూడా వెనక్కి తీసుకున్నారని విమర్శించారు. అన్నదాతలను ఆగం చేయడం, యూరియా అందించకపోవడం, రైతు రుణమాఫీ అమలు చేయకపోవడం, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడం ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోయేలా చేయడం, జాబ్ క్యాలెండర్ అమలు చేయకపోవడం ప్రజాపాలన అని నిలదీశారు. తెలంగాణ ఉన్నంత కాలం బీఆర్‌ఎస్ ఉంటుందని స్పష్టం చేశారు. అమాయకులను హతమారుస్తున్న బూటకపు ఎన్‌కౌంటర్లు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. టీజీపీ రాష్ట్ర అధ్యక్షుడు మర్రి యాదవరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు తాళ్లపల్లి జనార్దన్, పులి రజనీకాంత్, జోరిక రమేశ్, తండమల్ల వేణు, కుసుమ లక్ష్మీనారాయణ, నయీముద్దీన్, బండి రజనీకుమార్, దూలం వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

వార్డు ఆఫీసర్లుగా బాధ్యతలు

వరంగల్ అర్బన్ : బల్దియాకు చెందిన 28 మందికి వార్డు ఆఫీసర్లుగా బాధ్యతలు అప్పగిస్తూ బుధవారం కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం వీఆర్‌ఏ, వీఆర్‌ఓలను తిరిగి ఆయా మాతృసంస్థల్లో చేరాలని ఆదేశించింది. బల్దియాలో గ్రూప్–4లో కొలువులు పొందిన వార్డు ఆఫీసర్లు కొంత కాలంగా టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. జెల్లాల జాన్సీ (4వ డివిజన్), ఎం.క్రాంత్‌కుమార్‌కు (7వ డివిజన్), జిల్లా సమీనా (12వ), పాక శ్వేత (13వ), రాథోడ్ చరణ్ సింగ్ (17వ), పోచంపల్లి అనిల్ 20వ డివిజన్ వార్డు ఆఫీసర్లుగా నియమించారు. డి.దినేష్ (21వ), సూర నాగరాజ్ (24వ), గుండా రుత్విక్ (25వ), వి.వెంకట రఘు (26వ), ఎన్.భరత్ కుమార్ (27వ), ఎ.శిరీష (31వ), కావేటి వినయ్ (33వ), వి.సత్యనారాయణ (37వ), బొడ్డు అక్షయ్ కుమార్ (38వ), ఎన్.ప్రవీణ్ (40వ), ఎంకేవీ మనోహర్ (9వ), వి.సాయి కుమార్ 29వ వార్డు ఆఫీసర్, బండి వరుణ్‌కు మీ సేవా సెంటర్‌కు, ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూం బాధ్యతలు తేజస్వీకి అప్పగించారు.

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి కృషి



ప్రతిజ్ఞ చేయిస్తున్న అధ్యాపకులు

హసన్‌పర్తి: డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి సమష్టిగా కృషి చేయాలని కేయూ పాలక మండలి సభ్యురాలు, నార్కొటిక్స్ విభాగం యాంటీ డ్రగ్స్ కమిటీ సభ్యురాలు డాక్టర్ అనితారెడ్డి సూచించారు. కిట్స్ కళాశాలలో యాంటీ డ్రగ్స్‌పై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్రగ్స్ విక్రయించినా, కొనుగోలు చేసినా నేరంగా పరిగణిస్తున్నట్లు తెలిపారు. డ్రగ్స్ బారినపడి జీవితాలు నాశనం చేసుకోవద్దని పేర్కొన్నారు. విద్యార్థులను డ్రగ్స్ విక్రయదారులు పావులా వాడుకుంటున్నారని అన్నారు. ఈ సందర్భంగా యాంటీ డ్రగ్స్ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. సదస్సులో కిట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి, కేయూసీ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ప్రొఫెసర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తల్లిపాలు అందించిన లిఖిత


తల్లిపాలను అందజేస్తున్న లిఖిత

నర్సంపేట: చెన్నారావుపేట మండలం లింగాపురం గ్రామానికి చెందిన పల్నాటి కరుణాకర్ సతీమణి లిఖిత ఆదర్శంగా నిలిచింది. తన మూడు నెలల పాప వేదస్యకు తల్లిపాలు సరిపడా అందించిన అనంతరం మిగిలిన ఏడు లీటర్ల పాలను నిల్వ చేసి బుధవారం హనుమకొండలోని ప్రభుత్వ మాతాశిశు సంరక్షణ కేంద్రానికి అందించింది. ఇంతకు ముందు ఆగస్టు 29న నాలుగు లీటర్ల తల్లిపాలు అందించింది. ఇలా దానం చేయడం ద్వారా పలు కారణాల వల్ల తల్లిపాలు అందని శిశువులకు అవసరమైన పోషణ అందించగలుగుతారని లిఖిత తెలిపారు. ఈ కార్యక్రమం ప్రతీ తల్లి, శిశువు ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వడంతోపాటు ప్రేరణగా నిలుస్తుందని ఆమె పేర్కొన్నారు.

బకెట్ నుంచి వాటర్ హీటర్ తీస్తుండగా..

- విద్యుదాఘాతంతో మహిళ మృతి
- బొంతగట్టునాగారంలో ఘటన


లింగమ్మ (ఫైల్)

తరిగొప్పుల: స్నానానికి వేడి నీళ్ల కోసం బకెట్‌లో పెట్టిన వాటర్ హీటర్ తీస్తుండగా షాక్ తగిలి ఓ మహిళ మృతిచెందింది. ఈ ఘటన బుధవారం మండలంలోని బొంతగట్టునాగారంలో చోటుచేసుకుంది. ఎస్సై శ్రీదేవి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పిల్లి లింగమ్మ(48) బాత్‌రూంలో స్నానానికి వేడి నీళ్ల కోసం బకెట్‌లో వాటర్ హీటర్ పెట్టింది. అనంతరం స్విచ్ ఆఫ్ చేసి బకెట్‌లోని వాటర్ హీటర్ తీస్తుండగా విద్యుత్ సరఫరా అయ్యింది. దీంతో షాక్ తగిలి మృతి చెందింది. మృతురాలి భర్త మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇంటర్ వర్సిటీ పోటీలకు ఆర్చరీ జట్ల ఎంపిక


పోటీల ఎంపికకు హాజరైన క్రీడాకారులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ స్పోర్ట్స్‌బోర్డు ఆధ్వర్యంలో బుధవారం ఆర్చరీ పురుషుల, మహిళల జట్ల ఎంపికలు నిర్వహించారు. ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల నుంచి ఆర్చరీ క్రీడాకారులు తన్వీర్‌కౌసర్, త్రిశూల్,అశ్విత్, రమ్య, మనసుర హాసిభ, వెంకటేష్, ఆనంద్, గంగరాజు పాల్గొన్నారు. ఈ జట్లు ఈఏడాది అక్టోబర్‌లో పంజాబ్‌లోని గురుకాశీ యూనివర్సిటీ, పఠాన్‌లోని హెచ్ఎన్ యూనివర్సిటీలో నిర్వహించనున్న ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌లో పాల్గొంటారని కేయూ స్పోర్ట్స్‌బోర్డు సెక్రటరీ వై. వెంకయ్య తెలిపారు. డాక్టర్ ఏటీబీటీ ప్రసాద్, డాక్టర్ కుమారస్వామి, రాజేశ్, ఆంజేయులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడి దుర్మరణం

- జిల్లా కేంద్రం శివారులో ఘటన

ములుగు: జిల్లా కేంద్రం శివారులోని వివేకవర్ధిని పాఠశాల సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుగులోత్ శ్రీను (35) అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. ప్రేమ్‌నగర్‌కు చెందిన శ్రీను ద్విచక్ర వాహనంపై గట్టమ్మ నుంచి తన ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో ములుగు నుంచి హనుమకొండ వైపునకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు రోడ్డుపై ఉన్న గుంతను తప్పించబోయి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. దీంతో శ్రీను అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

అప్రమత్తతే ఆయుధం..

- మిరప పంటను ఆశిస్తున్న చీడపీడలు
- సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి
- జెమిని వైరస్, బొబ్బ రోగంపై జాగ్రత్తగా ఉండాలి
- రైతులకు మల్యాల కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ దిలీప్ కుమార్, శాస్త్రవేత్తలు సుహాసిని, క్రాంతికుమార్ సలహాలు


పైముడత సోకిన మిరప మొక్క


కింది ముడత సోకిన మొక్క


లద్దె పురుగు సోకిన మొక్క



మొక్కకు సోకిన జెమిని వైరస్

మహబూబాబాద్ రూరల్ : జెమిని వైరస్, బొబ్బ రోగం.. ప్రస్తుతం మిరప రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. పంటను నాటి నెలరోజులు గడవక ముందే చిన్న మొక్కలపై రైతులు పోటాపోటీగా పురుగుల మందులు, సిఫార్సు లేని బయో మందులను పిచికారీ చేస్తున్నారు. ఫలితంగా పెట్టుబడి పెరిగే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఆగస్టులో పొడి వాతావరణం పరిస్థితులలో వేసిన మిరప పంటను ప్రస్తుతం వివిధ చీడ పీడలు ఆశిస్తున్నాయి. దీంతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో మిరప పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని మహబూబాబాద్ మండలం మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త దిలీప్ కుమార్, శాస్త్రవేత్తలు సుహాసిని, క్రాంతికుమార్.. రైతులకు సలహాలు, సూచనలు చేశారు. ఆ వివరాలు వారి మాటల్లోనే..

పైముడత నివారణకు :
ఫిప్రోనిల్ ఎస్.సి 2 మిల్లీలీటర్లను లీటర్ నీటిలో లేదా డైఫెన్ థయురాన్ 1.5గ్రాములను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

కింది ముడత నివారణకు ..
నీటిలో కరిగే గంధకం 3 గ్రాములను లీటర్ నీటిలో లేదా స్పైరోమెసిఫెన్ 0.8 మిల్లీ లీటర్లను లీటర్ నీటికి లేదా ప్రాపర్ గైట్ 57శాతం 2 మిల్లీ లీటర్లను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

జెమిని మోజాయిక్ వైరస్ (గుబ్బ) నివారణకు..



- ఇది తెల్లదోమ ద్వారా వ్యాపిస్తుంది. వైరస్ నివారణకు ప్రత్యేకంగా ఎలాంటి మందులు లేవు. అందుకే సమగ్ర సస్య రక్షణ చర్యలు పాటించాలి.
- తొలిదశలోనే వైరస్ సోకిన మొక్కలను ఎప్పటికప్పుడు పీకి కాల్చి వేయాలి. ప్రధాన పొలంలో, గట్లపై కలుపు మొక్కలు లేకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్త తీసుకోవాలి. కొన్ని రకాల కలుపు మొక్కలు వైరస్ తెగుళ్లకు ఆశ్రయం కల్పిస్తాయి. మిరప తోటలో వంగ (బెండ), టమాట మొక్కలను ఎట్టి పరిస్థితుల్లోనూ పెంచొద్దు. ఇవి తెల్ల దోమలకు ఆశ్రయం కల్పిస్తాయి.

లద్దె పురుగు నివారణకు ..
నోవాల్యూరాన్ 0.75 మిల్లీ లీటర్లను లీటర్ నీటిలో లేదా స్పైనోసాడ్ 0.25 మిల్లీ లీటర్లను లీటర్ నీటిలో లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.5 గ్రాములను లీటర్ నీటిలో లేదా క్లోరాంత్రనిలిప్రోల్ 0.3 మిల్లీ లీటర్లను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. సిఫార్సు లేని బయో మందులను ఎట్టి పరిస్థితుల్లోనూ వాడొద్దు.

- పొలం చుట్టూ 2 నుంచి 3 వరుసల సజ్జ, జొన్న లేదా మొక్కజొన్న రక్షణ పంటలుగా వేసుకోవాలి. పసుపు, నీలం రంగు జిగురు అట్టలను 20 నుంచి 25 చొప్పున ఎకరానికి రైతులు సామూహికంగా వేసుకోవాలి. మొక్కల ఎత్తును బట్టి జిగురు అట్టలను కూడా పైకి అమర్చుకోవాలి. తెల్ల దోమల నివారణకు 5శాతం వేప గింజల కషాయం (వేప నూనె 1500 పీపీఎం) 5 మిల్లీ లీటర్లను లీటర్ నీటిలో లేదా పైరిప్రాక్సిఫెన్ 102 ఇ.సి. 1.5 మిల్లీ లీటర్లను లీటర్ నీటిలో లేదా ఫెరిప్రాక్సిఫెన్ 57. ఇ.సి. + ఫెన్ పోపాత్రిన్ 15 ఇ.సి. 1 మిల్లీ లీటర్‌ను లీటర్ నీటిలో లేదా ఫెనో పాత్రిన్ 30శాతం ఇ.సి 0.5 మిల్లీ లీటర్లను లీటర్ నీటిలో లేదా థయామిథాక్సాం 0.4 గ్రాములను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- ప్రతీ సారి రైతులు పురుగుమందును పిచికారీ చేసినప్పుడు కేవలం పురుగు మందును మాత్రమే కాకుండా పోషకాల మిశ్రమం (191919/13045) లేదా సూక్ష్మ పోషకాల మిశ్రమం 5 గ్రాములను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేస్తే మొక్కలకు బలాన్ని ఇస్తూ, వ్యాధి నిరోధక శక్తి పెరిగి కొత్తరకాల చీడ, పీడలను తట్టుకొని నిలబడే అవకాశం ఉంటుంది.

జాతీయ సైన్స్ సెమినార్‌లో రాణించాలి


అపూర్వశ్రీవాస్తవను అభినందిస్తున్న జిల్లాసైన్స్ అధికారి ఎస్.శ్రీనివాసస్వామి ,ఉపాధ్యాయులు

విద్యారణ్యపురి: రాష్ట్రస్థాయిలో నిర్వహించనున్న జాతీయ సైన్స్ సెమినార్‌లో రాణించాలని జిల్లా సైన్స్ అధికారి ఎస్. శ్రీనివాస్‌స్వామి కోరారు. బుధవారం లష్కర్‌బజార్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలోని జిల్లా సైన్స్ కేంద్రంలో జిల్లా స్థాయి జాతీయ సైన్స్‌సెమినార్ నిర్వహించారు. వివిధ పాఠశాలల నుంచి 18 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న అపూర్వశ్రీవాస్తవ రాష్ట్రస్థాయి జాతీయ సెమినార్‌కు ఎంపికయ్యారు. పెంబర్తిలోని ఏకశిల టెక్నో స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న ఎం.మన్వితారెడ్డి ద్వితీయ స్థానం, ఐనవోలులోని ఏకశిల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న వై.రేష్మ తృతీయ స్థానం సాధించారు. కేడీసీ కంప్యూటర్ సైన్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రవణకుమారి, వాగ్దేవి డిగ్రీ కాలేజీ కంప్యూటర్ సైన్స్ విభాగం అధ్యాపకురాలు బి.స్వప్న న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఈనెల 18న హైదరాబాద్‌లోని ఎస్‌సీఈఆర్‌టీలో నిర్వహించే రాష్ట్రస్థాయి జాతీయ సైన్స్‌సెమినార్‌లో అపూర్వశ్రీవాస్తవ పాల్గొననున్నారు.

అర్ధరాత్రి చైన్ స్నాచింగ్

- కేసు నమోదు చేసిన మట్టెవాడ పోలీసులు

రామన్నపేట : స్నేహితుడి కోసం ఒంటరిగా వేచి చూస్తున్న యువకుడి మెడలో నుంచి గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి బంగారు గొలుసు లాక్కెళ్లిన ఘటన మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ కథనం ప్రకారం.. మంచిర్యాల సప్తగిరి కాలనీకి చెందిన కుడితి రవితేజ హైదరాబాద్‌లో బీటెక్ చదువుతున్నాడు. మూడ్రోజుల క్రితం హనుమకొండలో నివాసముంటున్న సోదరుడి వద్దకు వచ్చాడు. మంగళవారం అర్ధరాత్రి హైదరాబాద్‌కు వెళ్తున్న స్నేహితుడిని కలిసి పోదామని ములుగు రోడ్డులోని ఓ గార్డెన్ దగ్గర వేచి చూస్తున్నాడు. ఈక్రమంలో రాత్రి ఒంటి గంట ప్రాంతంలో స్కూటర్‌పై వచ్చిన ముగ్గురు రవితేజను ఇక్కడ ఎందుకు ఉన్నావని ప్రశ్నించగా స్నేహితుడి కోసం ఉన్నానని చెప్పగా అక్కడి నుంచి వారు వెళ్లిపోయారు. కొద్ది నిమిషాల్లోనూ మళ్లీ స్కూటీపై తిరిగి వచ్చిన సదరు వ్యక్తులు రవితేజ మెడలోని తులంన్నర బంగారు గొలుసును లాక్కొని పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ పేర్కొన్నారు.

అదుపు తప్పిన కంటైనర్

హసన్‌పర్తి : ఆరెపల్లి–యాదాద్రి జాతీయ రహదారిపై వంగపహాడ్ వద్ద బుధవారం కంటైనర్ అదుపు తప్పి రోడ్డు కిందికి దూసుకెళ్లింది. ఈ సంఘటనలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరుగలేదు. జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. అలాగే బుధవారం ఉదయం చింతగట్టు సమీపంలోని ఓఆర్ఆర్ వద్ద సాంకేతిక కారణంతో లారీ నిలిచిపోయింది. కేయూ పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

వైభవంగా దసరా ఉత్సవాలు నిర్వహిస్తాం

బతుకమ్మ, విజయదశమికి ఏర్పాట్లు చేయండి
- రంగలీల మైదానం అభివృద్ధికి చర్యలు
- అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ


ఉర్సు రంగలీల మైదానాన్ని మేయర్, కలెక్టర్, సీపీతో కలిసి పరిశీలిస్తున్న మంత్రి సురేఖ

ఖిలా వరంగల్: సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. కరీమాబాద్‌లోని ఉర్సుగుట్ట రంగలీల మైదానంలో కలెక్టర్ డాక్టర్ సత్యశారద అధ్యక్షతన సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాల ఏర్పాట్లపై నగర మేయర్ గుండు సుధారాణి, నగర పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్, బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి మంత్రి సురేఖ సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలన్నారు. బతుకమ్మ ఆట స్థలాలను శుభ్రం చేయాలని బల్దియా అధికారులను ఆదేశించారు. దసరా కమిటీ విజ్ఞప్తి మేరకు రంగలీల మైదానంలో మైసూరును తలపించేలా దసరాకు అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రధాన రహదారుల్లోని గుంతలను పూడ్చివేయాలన్నారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ఉర్సుతోపాటు కాశిబుగ్గ, రంగశాయిపేట, శివనగర్‌లో మహిళా సంఘాలతో ఫుడ్‌స్టాళ్లు ఏర్పాటు చేయాలని తెలిపారు, రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ప్రతిరోజు ఒక జిల్లాలో బతుకమ్మ ఉత్సవాలు పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు, ఈనెల 21న వేయి స్తంభాల దేవాలయంలో నిర్వహించనున్న వేడుకలు ఏర్పాట్లు చేయాలని మంత్రి ఆదేశించారు. మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ డాక్టర్ సత్యశారద, సీపీ సన్‌ప్రీత్ సింగ్ మాట్లాడారు. సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలకు తగిన ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. సమావేశంలో డీసీపీ సలీమా, డీఆర్ఓ విజయలక్ష్మి, ట్రాఫిక్ డీసీపీ ప్రభాకర్‌రావు, ఏఎస్పీ శుభం ప్రకాశ్, ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, తహసీల్దార్లు ఇక్బాల్, శ్రీకాంత్, ఏసీపీలు జితేందర్‌రెడ్డి, సత్యనారాయణ, దసరా ఉత్సవ కమిటీ బాధ్యులు నాగపూరి సంజయ్‌బాబు గౌడ్, మేడిది మధుసూదన్, మండ వెంకటన్న, గోనె రాంప్రసాద్, గోపాల నవీన్‌రాజు,ప్రకాశ్ పాల్గొన్నారు.

చలించిన మంత్రి సురేఖ..

న్యూశాయంపేట : వరంగల్ దేశాయిపేట అర్బన్ హెల్త్ సెంటర్ సమీపంలో అన్నాచెల్లి సుమారు ఏడాది నుంచి స్థానికులు పెట్టిన ఆహార పదార్థాలు తింటూ అనాథలుగా ఉంటున్నారు. ఈ క్రమంలో బుధవారం స్వాస్థ్ నారీ, స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో పాల్గొనడానికి దేశాయిపేట అర్బన్ హెల్త్ సెంటర్‌కు వెళ్తున్న రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ.. అపరిశుభ్రంగా ఉన్న వారిని చూసి చలించారు. వెంటనే వారి వాకబు చేయగా వరంగల్ పోచమ్మ మైదాన్ ప్రాంతానికి చెందిన రజినీకాంత్, అతడి చెల్లి రమాదేవి అని తెలిసింది. రజినీకాంత్‌ను సహృదయ ఆశ్రమానికి, చెల్లి రమాదేవిని వైద్య చికిత్సల నిమిత్తం ఎంజీఎం తరలించాలని అధికారులను ఆదేశించారు. ఇద్దరికీ రేషన్‌కార్డు, డబుల్‌బెడ్‌రూమ్ ఇచ్చే ఏర్పాట్లు చేయాలని ఆర్‌డీఓను ఆదేశించారు.

డీసీసీబీలో ‘ప్రజాపాలన’


జాతీయ పతాకానికి వందనం చేస్తున్న రవీందర్ రావు

హన్మకొండ: హనుమకొండ నక్కలగుట్టలోని వరంగల్ డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో సెప్టెంబర్ 17ను పురస్కరించుకుని బుధవారం ప్రజాపాలన దినోత్సవం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంకు, వరంగల్ డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఈఓ వజీర్ సుల్తాన్, జీఎంలు ఉషశ్రీ, పద్మావతి, డీజీఎం అశోక్, ఏజీఎంలు మధు, గొట్టం స్రవంతి, గంప స్రవంతి, రాజు, కృష్ణ మోహన్, తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, ఆర్టీసీ అధికారులు

హన్మకొండ చౌరస్తా : టీజీఎస్ ఆర్టీసీ చేపట్టిన ‘యాత్రాదానం’ వాల్ పోస్టర్లను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆవిష్కరించారు. బుధవారం బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మాట్లాడారు. వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. పుట్టిన రోజు, వార్షికోత్సవం, పండుగలు, ఇతర శుభకార్యాలు, ప్రత్యేకమైన రోజుల్లో అనాథలు, వృద్ధులు, దివ్యాంగులు, పేద విద్యార్థులను పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాంతాల విహార యాత్రలకు తీసుకెళ్లేందుకు యాత్రాదానం ఉపయోగపడుతుందన్నారు. టూర్ ప్రారంభానికి వారం ముందు బస్సులను బుకింగ్ చేసుకోవాలని ఆర్టీసీ వరంగల్–1 డిపో మేనేజర్ పుప్పాల అర్పిత తెలిపారు. 80745 62195, 98663 73825, 9959226047 నంబర్లకు ఫోన్ చేసి టూర్ ప్యాకేజీ వివరాలు తెలుసుకోవచ్చని వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ట్రాఫిక్ సంతోష్‌కుమార్, టూర్ ప్యాకేజీ ఆఫీసర్ రాతిపల్లి సాంబయ్య పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి ఉపాధ్యాయుడి మృతి


రమేశ్‌నాయక్ మృతదేహం

హసన్‌పర్తి: బైక్ అదుపు తప్పి ఉపాధ్యాయుడు దుర్మరణం చెందాడు. ఈసంఘటన కేయూ–వడ్డేపల్లి రోడ్డులో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. ములుగు జిల్లా అన్నంపల్లికి చెందిన పోరిక రమేశ్‌నాయక్ (42) జవహర్‌కాలనీలో నివాసం ఉంటున్నాడు. వరంగల్ జిల్లా గీసుకొండ మండలం వంచనగిరి మోడల్ స్కూల్‌లో ఆయన ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం రాత్రి బైక్‌పై ఇంటి నుంచి కేయూ జంక్షన్ వైపు పని నిమిత్తం ఆయన బయల్దేరాడు. మార్గమధ్యలో తులసి బార్ సమీపంలో చీకటిగా ఉండడంతో ఎదురుగా వెళ్తున్న ఆవు కనిపించలేదు. దీంతో సడన్ బ్రేక్ వేయడంతో బైక్ అదుపు తప్పి ఆవును ఢీకొని కిందపడిపోయాడు. ఈసంఘటనలో తలకు బలమైన గాయమై రమేశ్ నాయక్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించారు.

ఎస్ఆర్ఆర్‌తోటలో ఆర్ఎంపీ వైద్యం

- తనిఖీ వెళ్లిన వైద్యులను గదిలో బంధించేందుకు యత్నం
- డయల్–100తో ఘటనా స్థలికి పోలీసులు
- ఫిర్యాదుతో ఆర్ఎంపీపై కేసు

ఖిలా వరంగల్ : రోగుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని ఆర్ఎంపీలు, పీఎంపీలు అందిన కాడికి దండుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. ఇదే తరహాలో వరంగల్ కరీమాబాద్ ఎస్ఆర్ఆర్ తోటలో అనుమతి లేకుండా ఓ ఆర్ఎంపీ వైద్యం చేస్తున్నట్లు బుధవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర వైద్య మండలి అధికారులకు సమాచారం అందింది. దీంతో అధికారులు బుధవారం రాత్రి 8గంటలకు ఆర్ఎంపీ నిర్వహిస్తున్న క్లినిక్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈక్రమంలోనే వైద్య మండలి సభ్యులైన డాక్టర్ ఎగ్గని శ్రీనివాస్, డాక్టర్ కుసుమ రాజు రవికుమార్, వెంకటస్వామిని అదే క్లినిక్‌లో బంధించేందుకు ప్రయత్నిస్తున్నట్లు సభ్యులు డయల్–100కు సమాచారం ఇచ్చారు. దీంతో ఘటనా స్థలానికి మిల్స్‌కాలనీ పోలీసులు క్షణాల్లో చేరుకొని వివరాలు సేకరించారు. ఆర్ఎంపీ క్లినిక్‌లోని వైద్యులను బయటికి పంపించగా వారు మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో అనుమతి లేకుండా ఆర్ఎంపీగా చలామణీ అవుతున్న వ్యక్తిపై ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైల్వే ఎన్ఐ వర్క్స్..

- పలు రైళ్లు రద్దు..హాల్టింగ్ ఎత్తివేత
- ఈ నెల 18, 19 తేదీల్లో అమలు

కాజీపేట రూరల్ : కాజీపేట సబ్ డివిజన్ పరిధిలోని కాజీపేట, బల్లార్షా మధ్య ఆటోమెటిక్ బ్లాక్ సిగ్నలింగ్ రైల్వే ఎన్ఐ వర్క్స్‌తో పలు రైళ్లను రద్దు చేయడంతోపాటు పలు రైళ్లకు వివిధ స్టేషన్లలో హాల్టింగ్ ఎత్తివేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ గురువారం తెలిపారు.

రద్దయిన రైళ్లు
ఈ నెల 19వ తేదీన కాజీపేట–సిర్పూర్‌టౌన్ (17003) ప్యాసింజర్, బల్లార్షా–కాజీపేట (17004) రామగిరి ప్యాసింజర్ , ఈ నెల 18వ తేదీన(నేడు) కాజీపేట–బల్లార్షా (17035) రామగిరి ప్యాసింజర్, బల్లార్షా–కాజీపేట (17036) ప్యాసింజర్, సిర్పూర్ టౌన్–కరీంనగర్ (87771) పుష్‌పుల్, కరీంనగర్–సిర్పూర్‌టౌన్ (67772) పుష్‌పుల్ రద్దయ్యాయి.

పాక్షికంగా రద్దయిన రైళ్లు
ఈ నెల 19వ తేదీన భద్రాచలం రోడ్–బల్లార్షా (1 7033) సింగరేణి కాజీపేట–బల్లార్షా మధ్య, సిర్పూర్ టౌన్–భద్రాచలంరోడ్ (17034) సింగరేణి సిర్పూర్ టౌన్–కాజీపేట మధ్య, సిర్పూర్‌కాగజ్‌నగర్–సికింద్రాబాద్ (17234) ఎక్స్‌ప్రెస్ సిర్పూర్‌కాగజ్‌నగర్–కాజీపేట మధ్య, ఈ నెల 18న సికింద్రాబాద్–సిర్పూర్‌కాగజ్‌నగర్ (17233) ఎక్స్‌ప్రెస్ కాజీపేట–సిర్పూర్‌కాగజ్‌నగర్ మధ్య రద్దు.

తాత్కాలికంగా హాల్టింగ్ ఎత్తివేత..
ఈ నెల 19వ తేదీన హైదరాబాద్–సిర్పూర్‌కాగజ్‌నగర్ (17011) ఎక్స్‌ప్రెస్‌కు, సిర్పూర్‌కాగజ్‌నగర్–బీదర్ (17012) ఎక్స్‌ప్రెస్‌కు మందమర్రి రైల్వే స్టేషన్‌లో హాల్టింగ్ ఎత్తివేశారు.

రెగ్యులేషన్ ట్రైన్..
ఈ నెల 19వ తేదీన డెహ్రాడూన్–చర్లపల్లి (07078) ఎక్స్‌ప్రెస్ 30 నిమిషాల పాటు రెగ్యులేటెడ్ చేశారు.

విద్యార్థులు ఉద్యమించాలి


మాట్లాడుతున్న మాడిశెట్టి అరుణ్ కుమార్

హన్మకొండ: సాయుధ పోరాట స్ఫూర్తితో విద్యారంగం అభివృద్ధి, విద్యారంగ సమస్యల పరిష్కారానికి విద్యార్థులు ఉద్యమించాలని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యూఎస్ఎఫ్ఐ) జాతీయ సలహాదారుడు అరుణ్‌కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం హనుమకొండ నక్కలగుట్టలోని హోటల్ హరిత కాకతీయలో యూఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా మహాసభ జరిగింది. ముందుగా హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కు నుంచి హోటల్ వరకు విద్యార్థులు ర్యాలీ తీశారు. ఏఐకేఎఫ్ జాతీయ కార్యదర్శి మోర్తాల చందర్‌రావు జెండావిష్కరణ చేశారు. భగత్‌సింగ్ చిత్రపటానికి అరుణ్‌కుమార్, నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం యూఎస్ఎఫ్ఐ అలుపెరుగని పోరాటాలను చేస్తోందని తెలిపారు. జిల్లా అధ్యక్షుడు మనోజ్, కార్యదర్శి మాలోత్ రాజేశ్‌నాయక్, నాయకులు బాలగోని రాకేష్, జయకృష్ణ, హరీశ్, కృష్ణమూర్తి, అభిరామ్, సురేశ్, ధనుశ్, మహేశ్ పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ యజ్ఞం


విశ్వకర్మ ఆరాధన చేస్తున్న భక్తులు, అర్చకులు

హన్మకొండ కల్చరల్ : వరంగల్ భద్రకాళి ఆలయ సమీపంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో బుధవారం విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం నిర్వహించారు. ఉదయం నుంచి విశ్వకర్మ పూజారులు గుటోజు కేదారీశ్వరాచారి ఆధ్వర్యంలో అర్చకులు సుప్రభాత సేవ, బ్రహ్మంగారి మూలమూర్తికి పంచామృతాభిషేకం, వివిధ పూజలు చేశారు. అనంతరం విశ్వకర్మ యజ్ఞంలో భాగంగా గణపతి, నవగ్రహ పూజలు, యజ్ఞం, పూర్ణాహుతి నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మారోజు సదానందాచారి, ప్రధాన కార్యదర్శి జల్లిపల్లి పెంటయాచారి, సభ్యులు భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

ఆర్థిక ప్రగతే లక్ష్యంగా ముందుకెళ్తున్న రాష్ట్రం

- టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి


మాట్లాడుతున్న సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి

హన్మకొండ: ఆర్థిక ప్రగతి, సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రం ముందుకెళ్తోందని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. బుధవారం హనుమకొండ నక్కలగుట్టలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో ప్రజాపాలన దినోత్సవం నిర్వహించారు. సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అమరవీరుల స్తూపం వద్ద పూలమాల ఉంచి అమరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు స్వేచ్ఛ, సమానత్వం, ఆత్మగౌరవం కోసం జరిపిన పోరాట ఫలితంగా 1948 సెప్టెంబర్ 17న ప్రత్యేక సంస్థానంగా ఉన్న తెలంగాణ ప్రాంతం భారత్‌లో విలీనమైందన్నారు. ప్రజలు స్వేచ్ఛావాయువులు పీల్చుకున్నారన్నారు. టీజీ ఎన్పీడీసీఎల్‌ను సాంకేతికంగా ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. డైరెక్టర్లు వి.మోహన్ రావు, వి.తిరుపతి రెడ్డి, టి.మధుసూదన్, సి.ప్రభాకర్, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బోనాల కిషన్, చీఫ్ ఇంజనీర్లు టి.సదర్‌లాల్, రాజు చౌహాన్, అశోక్, కె.మాధవరావు, చీఫ్ జనరల్ మేనేజర్లు రవీంద్రనాథ్, ఆర్.చరణ్ దాస్, జనరల్ మేనేజర్లు వెంకటకృష్ణ, మల్లికార్జున్,నాగప్రసాద్, వేణుబాబు, అన్నపూర్ణ, శ్రీకాంత్, కంపెనీ సెక్రటరీ కె.వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల డిజిటలైజేషన్ పూర్తి చేయాలి

ట్రాన్స్‌ఫార్మర్ల డిజిటలైజేషన్ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. బుధవారం హనుమకొండలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం నుంచి 16 సర్కిళ్ల ఎస్ఈలు, వివిధ విభాగాల డీఈలు, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాన్స్‌ఫార్మర్లపై ఉన్న సర్వీస్‌లను మ్యాపింగ్ చేయాలన్నారు. ఇంటి లోపల ఉన్న మీటర్లు బయట అమర్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. సర్కిల్ పరిధిలో విధిగా పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు వి.మోహన్ రావు, వి.తిరుపతి రెడ్డి, టి.మధుసూదన్, సి.ప్రభాకర్, సీఈలు టి.సదర్ లాల్, కె.తిరుమల్ రావు, రాజుచౌహాన్, సి.జి.ఎంఆర్. చరణ్ దాస్, జీఎంలు వెంకటకృష్ణ, అన్నపూర్ణ, నాగప్రసాద్, వేణుబాబు, కృష్ణ మోహన్ పాల్గొన్నారు.

గ్రామీణ పరిస్థితులపై సమగ్ర అధ్యయనం


తిమ్మాపురంలో ఎస్ఆర్ వ్యవసాయ కళాశాల డీన్ భూపాల్‌రాజు, అసిస్టెంట్ కమాండెంట్ వీరన్న, విద్యార్థులు

మామునూరు: గ్రామీణ పరిస్థితులపై సమగ్రంగా అధ్యయనం చేయాలని వ్యవసాయ కళాశాల డీన్ భూపాల్‌రాజు సూచించారు. ఈ మేరకు ఖిలా వరంగల్ మండలం తిమ్మాపురం రాంగోపాలపురంలో ఎస్ఆర్ యూనివర్సిటీ వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో గ్రామీణ పరిస్థితుల అధ్యయన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వనరులు, పటం, గ్రామ భౌగోళిక పరిస్థితులు, వ్యవసాయ స్థితిగతులు, సామాజిక అంశాలు, పశు సంవర్ధక రంగం, గ్రామ సమస్యలు వంటి అనేక అంశాలను విద్యార్థులు సమగ్రంగా సేకరించి చిత్రపటాల రూపంలో ప్రదర్శించాలన్నారు. ఇన్‌చార్జ్ డాక్టర్ శ్రీకర్‌రెడ్డి, అసిస్టెంట్ కమాండెంట్ వీరన్న, డాక్టర్ శ్రవణ్‌కుమార్, కేటీ విజయ్, ఇన్‌స్పెక్టర్లు కార్తీక్, వెంకటేశ్వర్లు, ఫార్మసీ అధికారులు జలగం రమేశ్‌కుమార్, బి.సురేశ్, డాక్టర్ మధు, శ్రావ్య, రవితేజ, ఏఈఓ సత్యప్రకాశ్, జలగం రమేశ్, సాసైటీ డైరెక్టర్లు చెన్నారెడ్డి, సాయి నందన్‌రెడ్డి, రాజేశ్వర్ రావు, ప్రసాద్‌రావు, రాములు, పాల్గొన్నారు.